ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 3 నవంబరు 2025



తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

● విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



శ్రీకాకుళం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటనపై ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేస్తున్నాం. దీనిపై తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవు' అని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ హెచ్చరించారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని విన్నవించారు. పోలీసు శాఖ అధికారిక సమాచారం మాత్రమే నమ్మి.. శాంతి, భద్రతలకు సహకరించాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆదివారం మూడు జిల్లాల పోలీసులతో ముందుగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. 'తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. సామాజిక మాధ్యమాల్లో కొంతమంది అవాస్తవాలు, అసత్య, దుష్ప్రచారాలను చేస్తున్నారు. ఇది చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఇటువంటి పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నాం. పోస్టులు పెట్టిన వివరాలు, లోకేషన్ ఆధారంగా గుర్తించి అవసరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామ'ని స్పష్టం చేశారు.



హరిపురం: మందసలో బృందావతి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే గౌతు శిరీష



టెక్కలి రూరల్: రామేశ్వరంలో చెక్కును పంపిణీ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం రూరల్ : బాధిత కుటుంబాలకు చెక్కును అందజేసిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే శంకర్

బాధితులకు అండగా ఉంటాం

● రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
● మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు పరామర్శ
● పరిహారం చెక్కుల పంపిణీ



సోంపేట : నిఖిల్ తండ్రికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

హరిపురం/ మందస/ టెక్కలి/ టెక్కలి రూరల్/ వజ్రపుకొత్తూరు/ నందిగాం/ సోంపేట/ శ్రీకాకుళం రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని వేంకటేశ్వరాలయంలో తొక్కిసలాట ఘటనకు సంబంధించిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మందస మండలం మందస, బెల్లుపటియాలో బృందావతి, దువ్వు రాజేశ్వరి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి పరామర్శించారు. వారికి ప్రభుత్వం తరఫున రూ.15లక్షలు చొప్పున పరిహారం చెక్కులు అందజేశారు. కుటుంబ సభ్యులను కోల్పోవడం ఎంతో బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, బావన దుర్యోధన (మిగతా 8వ పేజీలో..)

త్రిసభ్య కమిటీ విచారణ..

కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనపై విచారణకు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, శ్రీకాకుళం ఏఎస్పీ కేవీ రమణ, దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్‌తో కూడిన త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఘటనపై కమిటీ విచారించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించనుంది. ఈ మేరకు కమిటీ తొక్కిసలాట జరిగిన ఆలయాన్ని ఆదివారం పరిశీలించింది. భక్తుల మృతికి గల కారణాలను ప్రత్యక్షసాక్షులు, నిర్వాహకులను అడిగి తెలుసుకుంది. అంచనాకు మించి భక్తులు తరలిరావడం, ఆలయ ప్రాంగణంలో ఎటువంటి సీసీ కెమెరాలు లేకపోవడం, లోపల జరుగుతున్న వ్యవహారం బయటకు తెలియకపోవడం, బారికేడ్లు లేకపోవడం, క్యూలైన్‌లో ఉన్న స్టీల్‌రైలింగ్ పటిష్టంగా లేకపోవడం, పోలీసు బందోబస్తు కూడా లేకపోవడం వంటి అంశాలను కమిటీ గుర్తించింది. రెండుమూడు రోజుల్లో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు కసరత్తు చేస్తుంది.

తొక్కిసలాట ఘటన యాదృచ్ఛికమే..

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పలాస/రూరల్/కాశీబుగ్గనవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన యాదృచ్ఛికంగానే జరిగింది. ఎవరూ కావాలని చేసింది కాదు. భక్తులు కొంచెం సంయమనం పాటించినా.. నిర్వాహకులు బారికేడ్లు నిర్మించి జాగ్రత్తలు తీసుకున్నా ఈ ఘటన జరిగి ఉండేది కాదు.' అని దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మృతుల కుటుంబాలతో పాటు పలాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీష నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొక్కిసలాటలో 8 మంది మహిళలు, ఒక బాలుడు మృతి చెందడం హృదయవిదారకరమని అన్నారు. 'ముకుంద పండా మంచి ఉద్దేశంతోనే ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. సొంత స్థలంలో సొంత నిధులతో ఆలయాన్ని కట్టారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇంజనీర్లు, దేవాలయ స్థపతుల సలహాలు తీసుకొని ఉంటే ఈ ఘోర (మిగతా 8వ పేజీలో..)



కాశీబుగ్గలో వేంకటేశ్వరాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

వైసీపీ శవ రాజకీయం

● తప్పంతా పోలీసులపై నెట్టేసేలా సోషల్ మీడియాలో ఫేక్ వీడియో
● ఖండించిన పోలీసులు



శ్రీకాకుళం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనను వైసీపీ సోషల్ మీడియా వేదికగా శవ రాజకీయం చేసేందుకు యత్నించింది. ఓ ఫేక్ వీడియోను పోస్టు చేసి పోలీసులు, ప్రభుత్వంపై తప్పు నెట్టేయాలని చూసింది. దీన్ని పోలీసులు ఖండిస్తూ ఫ్యాక్ట్‌చెక్‌తో అసలు వీడియోను పెట్టారు. కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయం వద్ద శనివారం తొక్కిసలాట జరిగి తొమ్మిది మంది భక్తులు మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. దీనిపై అదే రోజు ఆలయ నిర్వహకుడు హరిముకుంద పండా మీడియాతో మాట్లాడుతూ.. 'ఇంత మంది జనాలు వస్తారని నేను ఊహించలేదని.. భద్రత కోసం పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని' చెప్పారు. ఈ వీడియోను వైసీపీ మార్ఫింగ్ చేసింది. పోలీసులకు ముందు రోజే సమాచారం ఇచ్చినా స్పందించలేదని హరిముకుంద పండా అన్నట్లు ఫేక్ వీడియోను సోషల్ మీడియాలో పెట్టింది. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇదంతా జరిగినట్లు మాజీమంత్రి సీదిరి సైతం వ్యాఖ్యలు చేశారు. దీనిపై పోలీసులు స్పందించారు. ఫ్యాక్ట్‌చెక్‌తో వైసీపీ సోషల్ మీడియా ప్రచారానికి బ్రేక్ వేశారు. హరిముకుంద పండా శనివారం మాట్లాడిన అసలు వీడియోను.. వైసీపీ పోస్టు చేసిన ఫేక్ వీడియోను పక్కపక్కనే పెట్టి విడుదల చేశారు. దుష్ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు కూడా జారీచేశారు. అసలు వీడియోను చూసిన నెటిజన్లు వైసీపీని తిట్టిపోస్తున్నారు. శవ రాజకీయాలు చేయడం ఆ పార్టీకి అలవాటేనంటూ కామెంట్లు చేస్తున్నారు.

ఆగని ఆర్తనాదాలు

● కాశీబుగ్గలోని తొక్కిసలాట ఘటన బాధితుల్లో కన్నీటిసుడులు
● ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పలాస/రూరల్/కాశీబుగ్గ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఏకాదశి పర్వదినం వేళ.. కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట మృతుల కుటుంబాలు, క్షతగాత్రుల్లో ఆర్తనాదాలు మిన్నంటుతూనే ఉన్నాయి. శనివారం ఆలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో రెయిలింగ్ ఊడిపోయి ప్రమాదం జరగ్గా.. తొమ్మిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే మరో 15 మంది గాయపడగా.. వారంతా పలాస, టెక్కలి, జెమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాగా.. మృతుల కుటుంబ సభ్యులు, క్షతగాత్రులు ఎవరిని కదిపినా.. కన్నీటిసుడులు తిరుగుతున్నాయి. దురదృష్టవశాత్తు జరిగిన ఆ ఘటనను తలచుకుని విషాదంలో మునిగిపోతున్నారు. ఒకే మార్గంలో అధిక సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగించడంతో తోపులాట జరిగిందని, ఒకరిపై ఒకరు పడడంతో తొక్కిసలాటకు దారితీసిందని బాధితులు చెబుతున్నారు. కాళ్లు, చేతులు, మెడ, నడుము, పాదాలకు బలమైన గాయాలయ్యాయని, దేవుడి దయతోనే తాము ప్రాణాలతో బయటపడ్డామని పేర్కొంటున్నారు.



తొక్కిసలాట ఘటనపై ఆరా తీస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ రమేశ్ తదితరులు

ఆలయాల భద్రతకు పటిష్ఠ చర్యలు

8లో

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

ఒక్క ఉదుటన మీదపడ్డారు..



కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయానికి మా గ్రామస్థులతో కలిసి వచ్చా. స్వామి దర్శనం కోసం అందరం క్యూలైన్‌లో ఉన్నాం. ఒక్క ఉదుటన భక్తులు మీద పడడంతో నేను కింద పడిపోయా. తరువాత ఏం జరిగిందో నాకు తెలియలేదు. చేతికి, నడుముకు, పాదాలకు దెబ్బలు తగిలాయి. ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స అందజేస్తున్నారు. ఇప్పుడు కాస్త తేరుకున్నా.

-పిన్నింటి గౌరీ, రామేశ్వరం, టెక్కలి మండలం

పెనుగులాటతోనే..



ఏకాదశి సందర్భంగా గుడికి వచ్చాను. ఒక్కసారిగా జరిగిన పెనుగులాటతోనే నేను కిందపడిపోయా. గాయపడడంతో నన్ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతోనే ఈ ప్రమాదం వాటిల్లింది.

-సోపాల వెంకటమ్మ, దిమ్మిడిజోల, నందిగాం మండలం

ఒకేసారి రాకపోకలు..



భక్తులంతా క్యూలో ఉండగా ఎటువంటి తోపులాట జరగలేదు. ఒక్కసారిగా ఇన్‌గేటు, అవుట్ గేటు నుంచి ఒకేసారి రాకపోకలు జరగడంతో ఈ ప్రమాదం జరిగింది. భక్తులు నా మీద పడడంతో కిందపడిపోయి గాయపడ్డా. కాలు, నడుముకు దెబ్బలు తగిలాయి. ఆస్పత్రిలో వైద్యం అందించడంతో ప్రస్తుతం బాగానే ఉంది.

-దండు భారతి, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

కిందపడి పోయాను..



మా గ్రామస్థులతో కలిసి నేను ఆలయానికి వచ్చా. ఆ రోజు ఉపవాసం కారణంగా నాకు నీరసంగా ఉంది. ఇదే సమయంలో తొక్కిసలాట జరిగింది. అసలు ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి గురై కిందపడిపోయా. ఆసుపత్రిలో చేర్చిన తరువాత తెలివి వచ్చింది. కాలికి, మెడకు, వీపులో తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నా. వైద్యులు చికిత్స అందజేస్తున్నారు.

-దట్టి ఆదమ్మ, శివరాంపురం, వజ్రపుకొత్తూరు మండలం

దేవుడి దయతో బయటపడ్డా..



తోపులాటకు గురై నాతో పాటు చాలామంది ఒకరిమీద ఒకరు పడ్డారు. కొందరు రైలింగ్‌ను దాటి కిందపడ్డారు. నన్ను తోసుకుంటూ కొందరు భక్తులు వెళ్లడంతో నేను కిందపడ్డా. నా చేతికి బలమైన గాయమైంది. దేవుడి దయతో ప్రాణాలతో బయటపడ్డా.

-గున్న చిట్టెమ్మ, నందిగాం

ఇప్పటికీ భయమేస్తుంది..



ఒకే మార్గంలో భక్తులు రాకపోకలు సాగించారు. దీంతో తోపులాట జరిగి భక్తులు ఒకరిపై ఒకరు పడ్డారు. క్యూలైన్‌లో ఉన్న నేను కూడా కిందపడిపోవడంతో నడుము, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వైద్యులు ప్రస్తుతం చికిత్స అందజేస్తున్నారు. ఈ ప్రమాదం గురించి తలుచుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది.

-దట్టి కాంతమ్మ, శివరాంపురం, నందిగాం మండలం

సరైన రక్షణ వ్యవస్థ లేదు..



ఆలయంలో సరైన రక్షణ వ్యవస్థ లేకపోవడంతోనే తోపులాట జరిగి ప్రమాద తీవ్రత పెరిగింది. ఒకే లైన్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు మీదకు వస్తుండడంతో నేను కిందపడిపోయా. కాలికి తీవ్రమైన దెబ్బ తగిలింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా.

-గంగాల హరికృష్ణ, ధర్మపురం, ఇచ్ఛాపురం మండలం

వణికిపోయాను..



నేను ఆలయానికి వచ్చేసరికే అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి ఉన్నారు. సరైన రక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డా. తొక్కిసలాట జరిగి నా పక్కన ఉన్నవారు మృతి చెందడంతో నేను వణికిపోయా. నా కాలికి తీవ్రగాయమైంది. ఆసుపత్రిలో కోలుకుంటున్నా.

-రోణంకి రమాదేవి, తేలినీలాపురం, టెక్కలి మండలం

కదలలేకపోయాను..

క్యూలో భక్తులు ఒక్కసారిగా పైపైకి రావడంతో తొక్కిసలాట జరిగింది. నేను ఎటూ కదల లేకపోయా. కిందపడడంతో కాలు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స పొందుతున్నా.

-పిన్నింటి నాగమ్మ, రామేశ్వరం, టెక్కలి మండలం

భక్తుల తాకిడితోనే..

భక్తుల తాకిడితోనే తోపులాట చోటుచేసుకుంది. భక్తులు గుంపుగా మీదకువచ్చి పడడంతో నా కాళ్లకు దెబ్బలు తగిలాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాను. ప్రస్తుతం బాగానే ఉంది.

-బొడ్డపాడు పుష్ప, చినహంస, మెళియాపుట్టి మండలం

సముద్రంలో బోటు బోల్తా

● మత్స్యకారులు సురక్షితం ● రూ.15 లక్షల ఆస్తినష్టం

సోంపేట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో బోటు బోల్తాపడిన ఘటనలో రూ.15 లక్షల ఆస్తినష్టం సంభవించింది. అందులోని మత్స్యకారులు ఈదుకుంటూ సురక్షితంగా తీరానికి చేరుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఎకువూరు గ్రామానికి చెందిన 12 మంది మత్స్యకారులు ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో బోటులో సముద్రంలోకి వేటకు వెళ్లారు. వలలో చేపలు పడ్డాక సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తీరానికి వస్తుండగా పెద్దఎత్తున ఎగిసిపడిన అలలకు బోటులోకి నీరు చేరింది. దీంతో బోటు మునిగిపోయింది. అందులో ఉన్న మత్స్యకారులు కొండ గోపాల్, మైలపల్లి బాలరాజు, జి.దాసు, మైలపల్లి కూర్మారావు, బి.వెంకటరావు, కోలేటి వెంకటరావుతో పాటు మరో ఆరుగురు సముద్రంలో ఈదుకుంటూ సురక్షితంగా తీరానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ ద్వారా బోటును బయటకు లాగే ప్రయత్నం చేయగా సముద్రంలో ఆటుపోట్లు కారణంగా సాధ్యంకాలేదు. కొత్త టెక్నాలజీతో ఇటీవల ఈ బోటును తయారు చేశామని, సముద్రంలో మునిగిపోవడంతో సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని మత్స్యకారులు చెబుతున్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.



సముద్రంలో బోల్తాపడిన బోటు

కలెక్టర్ ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు

● నేడు జిల్లాకు రానున్న డీజీపీ

7లో

పోలీసు పహారాలోనే..

● వెలవెలబోయిన వెంకన్న ఆలయ ప్రాంగణం

8లో



అరసవల్లి: ఇంద్రపుష్కరిణిలో తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



గార : శ్రీకూర్మంలో తెప్పోత్సవం

వైభవం.. తెప్పోత్సవం

● అరసవల్లి, శ్రీకూర్మం పుణ్యక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

7లో

ఎర్రన్న ఆశయ సాధనకు కృషి చేస్తాం

● కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత నేత, కేంద్ర మాజీమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఆశయసాధనకు కృషి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద పలువురు నాయకులు, కుటుంబసభ్యులతో కలిసి నివాళులర్పించారు. తొలుత నిమ్మాడలో ఉన్న ఎర్రన్నాయుడు విగ్రహానికి ఆయన సతీమణి విజయలక్ష్మి, సోదరుడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ కింజరాపు ప్రభాకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీమంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎర్రన్న ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

వైభవం.. తెప్పోత్సవం

● అరసవల్లి, శ్రీకూర్మంలకు పోటెత్తిన భక్తులు

అరసవల్లి/గార/శ్రీకాకుళం క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి, శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామి వారి హంసనావికోత్సవం (తెప్పోత్సవం) ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని ఇంద్రపుష్కరిణిలో సూర్యనారాయణ స్వామి వారు విహరించి భక్తులకు కనువిందు చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని కనులారా వీక్షించి తరించారు. అంతకు ముందు స్వామిని ప్రత్యేక పల్లకిలో వేంచేపు చేసి ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ నేతృత్వంలో తిరువీధి నిర్వహించి పుష్కరిలో ఏర్పాటు చేసిన నావికలో ఉంచి విహరింపజేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వైజయంతి కళావేదికపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఓం ఆదిత్యాయ, ఓం నమో సూర్యాయనమః అంటూ భక్తులు నినదించారు. డీఎస్పీ సీహెచ్ వివేకా నంద నేతృత్వంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఆలయంలోనూ ప్రత్యేక క్యూలైన్ల వద్ద సిబ్బంది పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.సాయిప్రత్యూష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




గార: శ్రీకూర్మంలో తెప్పోత్సవానికి హాజరైన భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామి పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



అరసవల్లి ఇంద్ర పుష్కరిణిలో దీపాలను వదిలి స్వామిని దర్శించుకుంటున్న భక్తజన సందోహం (ఇన్‌సెట్‌లో) స్వామి



వర్షంలోనూ తెప్పపై విహరిస్తున్న స్వామి

శ్వేత పుష్కరిణిలో విహరించిన కూర్మనాథుడు..

ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథుని ఆలయంలో తెప్పోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. కార్తీకశుద్ధ ద్వాదశి రోజున శ్వేత పుష్కరిణిలో స్వామి వారి నావికోత్సవం అశేష భక్తజనం మధ్య వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ఈవో నరసింహ నాయుడు ఆధ్వర్యంలో స్వామిని పల్లకిలో వేంచేపు చేసి పుష్పా లంకరణ చేసి ప్రధాన అర్చకుడు సీతారామ నరసింహాచార్యులు ఇతర అర్చక స్వాములు వేద మంత్రాల మధ్య పుష్కరిణికి తీసుకువచ్చారు. నావికపై వేంచేపు చేసిన స్వామిని పుష్కరిణిలో ఉన్న ఉగ్ర నరసింహ స్వామి వారి విగ్రహం వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ స్వామి వారి పల్లకిని వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ..

కాశీబుగ్గలో జరిగిన సంఘటన నేపథ్యంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, ఆర్డీవో సాయిప్రత్యూష పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, ఆర్మ్‌డ్ పోలీసులు అరసవల్లి, శ్రీకూర్మంలలో ప్రత్యేక బందోబస్తు నిర్వ హించారు. పుష్కరిణి, ఆలయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుని ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.



నృత్యాభినయం..

ఏర్పాట్ల పరిశీలన

అరసవల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా స్వామివారి తెప్పోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఆర్డీవో కె.సాయి ప్రత్యూషలతో కలిసి పరిశీలించారు. కాశీబుగ్గ ఘటనను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంద్రపుష్కరిణి వద్ద,క్యూలైన్లు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.



ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ పుండ్కర్

కలెక్టర్ ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు

● నేడు జిల్లాకు రానున్న డీజీపీ

శ్రీకాకుళం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో 9 మంది మృతిపై ఇప్పటికే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇచ్చే ఆధారంగా చర్యలు ఉండే అవకాశం ఉంది. అయితే త్రిసభ్య కమిటీ విచారణ, ఇందులో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఇచ్చే నివేదిక కూడా కీలకం కానుంది. ప్రైవేటు ఆలయంలో జరిగిన ఘటన అయినా.. ప్రభుత్వం తక్షణం స్పందించి మంత్రుల బృందం బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి భరోసా ఇచ్చారు. 24 గంటల వ్యవధిలోనే పరిహారం చెల్లించి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని పైగా కేంద్రప్రభుత్వం కూడా పరిహారం చెల్లిస్తుందని వెల్లడించారు. రాజకీయాలకు తావులేకుండా మానవత్వంతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టి తక్షణం స్పందించడం అభినందనీయమే. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల కుటుంబాలకు సైతం పరిహారాన్ని అందజేశారు. నిరంతరం పరిస్థితిని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు, ఎమ్మెల్యేలు పర్యవేక్షించి ప్రభుత్వానికి సమాచారం ఇస్తున్నారు. ఆపై బాధితులకు అండగా ఉంటున్నారు. ఈ ఘటన నేపథ్యంలో దర్యాప్తు కమిటీ విచారణ ప్రారంభించింది. ఇదిలా ఉండగా.. కాశీబుగ్గలో వేలాదిగా ప్రైవేటు వాహనాలు.. బస్సులు, ద్విచక్ర వాహనాల్లో జనాలు తరలివస్తున్నా పట్టణంలో ఉండే పోలీసులు ట్రాఫిక్ ఆధారంగానైనా సమాచారాన్ని గుర్తించి సీఐకి చేరవేయలేదా? అక్కడ ఏ ప్రమాదం జరగదన్న ధీమా సీఐలో నెలకొందా అన్నది చర్చనీయాంశంగా మారింది. సమాచారం తెలుసుకుని వ్యవహరించి ఉంటే ప్రాణనష్టం జరిగేదికాదన్న ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో స్థానిక పోలీసుల పాత్రపైనా విచారణ జరిగే అవకాశముంది.

● సిట్‌కు అవకాశం

సీఎం చంద్రబాబునాయుడు లండన్ పర్యటనలో ఉన్నారు. అయినా.. ఈ ఘటనపై ఇప్పటికే తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా జిల్లాకు రానున్నారు. డీజీపీ తొలుత అరసవల్లి ఆదిత్యుణ్ని దర్శించుకుంటారు. కాశీబుగ్గ ఆలయ ఘటనపై సిట్ వేయనున్నట్లు ఇప్పటికే సమాచారం. సిట్ వేస్తున్నట్లు ఆయన ప్రకటించే అవకాశం ఉంది. డీజీపీ రానుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

'ధర్మకర్తను బాధ్యుడిని చేయడం అన్యాయం'

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటనకు 95 ఏళ్ల ఆలయ ధర్మకర్తను ప్రభుత్వం బాధ్యుడిని చేసి మాట్లాడడం అన్యాయమని మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ నాయకుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మృతులకు శాంతి కలగాలని కోరుకుంటూ ఆదివారం వైసీపీ నాయకులతో కలిసి నగరంలో ఏడు రోడ్ల కూడలిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు మరో రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

5న కైలాసగిరి ప్రదక్షిణ

జి.సిగడాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5న ఎందువలోని కైలాశేశ్వర క్షేత్రం వద్ద గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 5 గంటలకు కైలాసగిరి క్షేత్ర శివాలయం వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభమై ఎందువ, నడిమివలస, శేతుభీమవరం, గెడ్డకంచరాం గ్రామాల్లోని పైడి తల్లి అమ్మవారి వనం మీదుగా సాగుతుందన్నారు. గత ఏడాది కూడా దిగ్విజయంగా గిరి ప్రదక్షిణ సాగిందని, రాత్రి 7 గంటలకు 121 కేజీల ఆవు నెయ్యితో అఖండ జ్యోతి ప్రజ్వలన చేపడుతున్నామన్నారు. 21 అడుగుల గౌరీ శంకరుల విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరుతున్నారు.

ఎర్రన్నకు ఘన నివాళి

దివంగత కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 13వ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీకాకుళంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పాతపట్నం: ఎర్రన్నాయుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



రణస్థలం: ఎర్రన్నాయుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, సీఎం రమేష్, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



శ్రీకాకుళంలో ఎర్రన్న విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



కొత్తూరు: మాతలలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట



నరసన్నపేట: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

శవ రాజకీయాలకు కేరాఫ్ వైసీపీ



ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి శవ రాజకీ యాలకు కేరాఫ్ అడ్రస్‌గా వైసీపీ మారిందని పీయూసీ రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించినప్పటికీ దానిని వైసీపీ రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. కాశీబుగ్గ ఘటన దురదృష్టకరమని, దేవుని దర్శనానికి వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. సమయం, సందర్భం, విషయం తెలుసుకోకుండా తొక్కిలాటలో భక్తులు చనిపోగానే వైసీపీ శవ రాజకీయం మొదలు పెట్టిందని విమర్శించారు.

దురదృష్టకర ఘటనపై రాజకీయమా?

కవిటి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర దేవాలయం వద్ద శనివారం జరి గిన ఘటన దురదృష్టకరమని, అయితే దీనిపై వైసీపీ నేతలు రాజకీయం చేయడం తగదని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పర్వదినాన భక్తులు అధికంగా రావడంతో ఊహించని ప్రమాదం జరిగిం దన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తగు చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం ఓ వైపు బాధితులకు సహాయం చేయాలని చూస్తుంటే మాజీ మంత్రి అప్పలరాజు ఫొటో ఫోజులిస్తూ ప్రభుత్వం పై బురద జల్లేందుకు ఆరాటపడ్డారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్‌ప్రధాన్, డైరెక్టర్ బి.చిన్నబాబు, పి.కృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

వైసీపీ డీఎన్ఏలోనే శవ రాజకీయాలు

అరసవల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన ఘటనలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, కాని ఇటువంటి విషయంలో కూడా వైసీపీ నాయకులు శవ రాజకీయాలకు పాల్పడడం దారుణమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం విశాఖ-ఏ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇంతటి విచారకర సమయంలో కూడా వైసీపీ నాయకులు కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడడం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో పోస్టులు పెట్టడం సహించరాని విషయమన్నారు. నిజానికి శవ రాజకీయాలు వైసీపీ డీఎన్ఏలోనే ఉన్నాయ న్నారు. తప్పుడు ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకో వాలని కోరారు. సమావేశంలో నేతలు రెడ్డి గిరిజాశంకర్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: కలిశెట్టి

రణస్థలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలో జరిగన ఘటన దురదృష్టకరమని, దేవుడు దర్శనం కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అన్ని విధాలా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ప్రమాదం జరిగిన గుడి ప్రైవేటు నిర్వహణలో నడుస్తోందని వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ నేతలు శవ రాజకీయం చేయడం దారుణమన్నారు.

ఆదిత్యుని సేవలో దేవదాయశాఖ కమిషనర్

అరసవల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని దేవదాయశాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ, ఈవో కేఎన్‌వీ డీవీ ప్రసాద్ స్వాగతం పలుకగా, అర్చకులు, వేదపండితులు వేద మంత్రా లతో ఆశీర్వదించారు. అనంతరం ఆయనకు ప్రసాదాలు, జ్ఞాపికను వారు అందించారు. కార్యక్రమం లో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, ఫణీంద్రశర్మ, రంజిత్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ● కార్తీక శుద్ధ ద్వాదశి ఆదివారం అరసవల్లి ఆదిత్యుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉచిత దర్శనానికి వచ్చిన భక్తులు క్యూలైన్లను దాటి బయట లైన్లలో నిల్చున్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.10,52,283 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.7,20,900, విరా ళాలు రూ.58,433, ప్రసాదాల ద్వారా రూ.2,72,950 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పుస్తెలతాళ్లు బహుమానం

అరసవల్లి సూర్యనారాయణ స్వామికి శ్రీకాకుళానికి చెందిన పొడుగు వెంకటసూర్య ప్రభాకర రావు, వెంకటరమణ, కరుణాకర రావు, రాజేష్ ఖన్నా 9.820 గ్రాముల బంగారం పుస్తెల తాళ్లను ఆదివారం ఈవో ప్రసాద్, ప్రధాన అర్చకుడు శంకర శర్మలకు అందజేశారు. వీరికి అర్చకులు ఆశీర్వదించి జ్ఞాపికను అందించారు.



కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈవో

అగ్నిప్రమాద బాధితులకు సాయం



దుస్తులు అందిస్తున్న కూటమి నాయకులు

లావేరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బుడుమూరు అగ్నిప్రమాద బాధితులను విజయ నగరం పార్లమెంట్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు, పెద్దకొత్తపల్లి సర్పంచ్, టీడీపీ నేత ఆరెళ్ల కృష్ణ సాయం పరామర్శించారు. ఆరెళ్ల కృష్ణ బాధితులైన ముంత గోపి, శ్రీరాములు, పైడిరాజు, వనము శ్రీనివాసరావు కుటుంబాలకు ఒక్కో బియ్యం బస్తా, చీర దుప్పటి, టవల్ అందించారు. ఇజ్జాడ శ్రీనివాసరావు ఒకొక్కరికి రూ.2500 నగదు, ఒక్కో బియ్యం బస్తా అందజేశారు. కార్యక్రమంలో లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు కూనపల్లి దామోదర రావు, టీడీపీ నాయకులు లంక నారాయణరావు, కోనేటి శ్రీనివాస రావు, దన్నాన శ్రీనివాసరావు, నల్లి లక్ష్మన్నాయుడు, పండి గోపాలరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఇచ్ఛాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన జనసైనికుడు విజయ్ జీవనోపాధికోసం దుబాయ్ వెళ్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి రాజు తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

రీసర్వే పక్కాగా జరగాలి

రణస్థలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించిన భూ రీ సర్వే పక్కాగా జరగాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ సర్వేర్ సీహెచ్.వీఎస్ఎన్ కుమార్ అన్నారు. నారాయణపట్నంలో ఆదివారం రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, పలువురు రైతులు ఉన్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్లకు సత్కారం

కంచిలి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఆర్మీలో విశేష సేవలు అందించి రిటైర్ అయిన మక రాంపురం గ్రామానికి చెందిన వారిని ఆదివారం గ్రామస్థులు సత్కరించారు. ఇటీవల రిటైర్ గ్రామానికి వచ్చిన వజ్జ గోపీనాథ్ (బీఎస్ఎఫ్), గొండ్యాల ప్రసన్నకుమార్, వజ్జ కృష్ణారావులను విశ్వశాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో షిర్డీ సాయి బాబా మందిరంలో శాలువలు కప్పి సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్థులు వి.రామారావు, రమణ స్వామి, అప్పారావు పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఘటన విషాదకరం

ఇచ్ఛాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏకాదశి పర్వదినం నాడు కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన ఘటనలో భక్తులు మృతి చెందడం దురదృష్టకరమని టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు తదితరులు అన్నారు. ఈ మేరకు ఆదివారం బస్టాండ్ జంక్షన్ వద్ద ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద టీడీపీ నాయకులు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి అండ

ఇచ్ఛాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు కేశుపురంలో దూడ మోహనమ్మకు చెందిన మట్టి ఇల్లు గోడ కూలిపోయింది. దీంతో ఆ కుటుంబం తలదాచుకునేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసు కున్న శ్రీకాళీమాత సేవా సమితి సభ్యులు ఆదివారం రూ.50 వేలు నగదు అందించారు.

యువత రక్తదానం

ఇచ్ఛాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాత లుగా నిలవాలని జీఎస్ ఫౌండేషన్ సభ్యులు కోరారు. కొఠారి గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో తలసేమియా బాధిత పిల్లలకు, గర్భిణుల కోసం ఆదివారం 40మంది యువకులు రక్తదానం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కంచిలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కంచమ్మతల్లి అమ్మవారి హుండీ లెక్కింపు దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. అక్టోబరు నెలకు సంబంధించి రూ.38631 వచ్చిందిన ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఇచ్ఛాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బాహుదా నది నుంచి ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఇటీవల ఎమ్మెల్యే అశోక్ అధికారులతో సమీక్ష సమావేశంలోనూ ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

గ్రూప్-డి పరీక్షకు స్పందన

అరసవల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం నిర్వహిస్తున్న ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆదివారం ఆర్ఆర్‌బీ గ్రూప్-డీ మాక్ టెస్టు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఈ పరీక్షకు 358 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సబ్‌జూనియర్ కబడ్డీ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 74 మంది బాలికలు, 129 మంది బాలురు ఎంపికలకు హాజరయ్యారు. ఈ ఎంపికలు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు నక్క కృష్ణారావు, కార్యదర్శి సాధు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, శిక్షకులు సింహాచలం, జాన్సీ పర్యవేక్షణలో జరిగాయి.

స్టేడియంలో జూడో జట్ల..

కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ 14, 17, 19 బాలబాలికల జూడో ఎంపికలు జరిగాయి. సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయమా ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంవీరమణ, జిల్లా క్రీడా ప్రాధికార శిక్షకుడు మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా క్రికెట్ జట్టుకు..

ఎచ్చెర్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థి సాయి గణేష్ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. అండర్-19 విభాగంలో శ్రీకాకుళం జట్టు తరఫున సాయి గణేష్ ప్రాతినిధ్యం వహించనున్నారు. శ్రీకాకుళంలో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ సందర్భంగా గణేష్‌ను క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ తదితరులు అభినందించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి

● మృతుడు విజయనగరం జిల్లా వాసి



శివాజీ(ఫైల్)

కవిటి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జగతి గ్రామ స మీపంలోని రోడ్డు మలుపులో విద్యుత్ స్తంభానికి ద్విచక్ర వాహనం ఢీకొని జి.శివాజీ(25) శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా దత్తిరాజు మండలం పెద్దమానా పురానికి చెందిన జి.శివాజీ భారత్ గ్యాస్ కంపెనీలో విధులు నిర్వహిస్తుంటాడు. ఇతడు కొత్తపుట్టుగ, లండారిపుట్టుగ పంచాయతీ పరిధిలోని గృహావసరాలకు వినియోగించే కనెక్షన్లను పరిశీలించి నివేదిక ఇస్తుంటాడని కవిటి ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే శనివారం రాత్రి తోటి సిబ్బంది వద్ద ద్విచక్ర వాహనం తీసుకుని కవిటి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదాన్ని ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీనిపై మృతుడి బాబాయి జి.చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎ.ప్రకాశరావు తెలిపారు. మలుపు వద్ద బైక్ అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

చెరువులో పడి ఒకరు..

పాతపట్నం నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గంగువాడ పంచాయతీ గొల్లపేట గ్రామానికి చెందిన మెట్ట చిన్నారావు(59) అనేవ్యక్తి బి.గోపాలపురం సమీపంలోని కృష్ణసాగరం చెరువలో ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందినట్టు ఎస్‌ఐ కె.మధుసూధనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చిన్నారావు సమీప బంధువు బి.గోపాలపురం గ్రామంలో మృతిచెందడంతో పరామర్శకి వెళ్లి తిరిగివస్తుండగా మార్గమధ్యలో గల కృష్ణసాగరం చెరువులో స్నానానికై దిగాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. చిన్నారావుకి భార్య చిన్నమ్ముడు, ఇద్దరు వివాహిత కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

నదిలో పడి యువకుడు..



సాయితేజ(ఫైల్)

పాతపట్నం/పర్లాకిమిడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మహేంద్రతనయనదిలో ప్రమాదవశాత్తుపడి పర్లాకిమిడికి చెందిన కసిమికోట సాయితేజ్ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం, పర్లాకిమిడి పట్టణ భగాతీవీధి కు చెందిన సాయితేజ ఆదివారం వేకువజామున కార్తీక ఏకాదశి పూజల్లో భాగంగా నదీస్నానం ఆచరించందుకు వెళ్లాడు. పాతపట్నంలోని నీలకంఠేశ్వరుని ఆలయ సమీపంలోఉన్న మహేంద్రతనయ నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కొట్టు కుపోయాడు. సమీపంగా ఉన్న కొందమంది ఆ విద్యార్థిని బయటకి తీసి పర్లాకి మిడి ప్రభుత్వ ఆసుపత్రికు తరలించారు. అప్పటికే సాయితేజ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు పాతపట్నంలోని ఓప్రైవేటు విద్యాసంస్థలో 10వతరగతి చదువుతున్నాడు. సాయితేజ్‌కి తల్లి ఇందుమతి, తండ్రి దుల్లభ, చెల్లి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్ అంధకారం

టెక్కలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్ అంధకారంతో నిండిందని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం టెక్కలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు పెన్షన్ లేక జీవితాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. సీపీఎస్ రద్దు చేయమంటే జీపీఎస్, యూపీఎస్ పేరుతో మోసం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారినా ఉద్యోగుల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు చల్ల సింహాచలం, బోకర బాలకృష్ణ, షణ్ముఖరావు, క్రిష్ణ, చక్రవర్తి తదితరులు ఉన్నారు.

భక్తుల భద్రతకు చర్యలు చేపట్టాలి

పలాస/రూరల్/కాశీబుగ్గ, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో భక్తుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎ.లోకనాథం, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. పట్టణ పరిధిలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో గాయపడి పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతుల్లో మహిళలు, చిన్నపిల్లవాడు ఉండడం విచారకరమన్నారు. ఏకాదశి కావడంతోనే అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా నిర్వాహకులు సరైన ఏర్పాట్లు చేయకపోవడం దారుణమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.5 లక్షలు, ఉచిత వైద్యం, చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వారితో పాటు కార్యవర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, సీపీఎం జిల్లా కన్వీనర్ ప్రకాషరావు, ఎన్.గణపతి ఉన్నారు.

తొక్కిసలాట ఘటన యాదృచ్ఛికమే..

(ఐదో పేజీ తరువాయి)

ప్రమాదం జరిగి ఉండేది కాదు. దుర్ఘటన విషయం తెలిసిన వెంటనే మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించాం. అవసరమైన వారికి సర్జరీలు చేయిస్తాం. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. 24 గంటల వ్యవధిలోనే మృతుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.15లక్షలు, కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.2లక్షలు అందించాం. ప్రైవేటు ఆలయంలో జరిగిన ఘటనను రాజకీయం చేయడం దురదృష్టకరం. ముకుందపండా ఆలయ నిర్మాణంలో టీటీడీ స్థాయిలో ఏర్పాటు చేయాలనుకున్నారు. అది ఆగమశాస్త్ర ప్రకారం జరగలేదు. ఆయనకు తగు సూచనలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఏది చేయాలో అది చేస్తాం. దేవదాయశాఖ కమిషనర్, ఇంజనీర్ల సహకారంతో ఆలయాభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. దీనికి ముకుందపండా సహకరించాలి. ఇక నుంచి ప్రైవేటు ఆలయాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. దీనికోసం ప్రత్యేక వ్యవస్థను సైతం అందుబాటులోకి తెస్తాం. దీనిపై త్వరలోనే రాష్ట్రస్థాయిలో చర్యలు చేపడతాం. ప్రైవేట్ ఆలయాల వివరాలను తీసుకుంటాం. అడ్వయిజరీ కమిటీని నియమించి ఆలయాల నిర్మాణాలు, వాటి జాబితా తయారు చేస్తున్నాం. కలెక్టర్ల వద్ద వాటి వివరాలు ఉండే విధంగా పొందుపరుస్తాం. అవసరమైనప్పుడు బందోబస్తుకు అవకాశం ఉంటుంది. గత వైసీపీ పాలనలో ఆలయాలపై అనేక దాడులు జరిగాయి. వాటి వివరాలు కూడా ప్రస్తుతం లేవు.' అని మంత్రి ఆనం తెలిపారు. ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ.. ఇంతటి పెను విషాదంలో కూడా వైసీపీ రాజకీయాలు చేయడం తగదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, విమర్శలు చేస్తున్న వారిని వారి విజ్ఞతకే వదిలేస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గౌతు శివాజీ, ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్, వై.వెంకన్నచౌదరి తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవుడి సన్నిధిలో మంత్రి ఆనం

మందస/హరిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం మందసలోని వాసుదేవపెరుమాళ్‌ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు కూర్మాచార్యులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే గౌతు శిరీష, తహసీల్దార్ శ్రీకాంత్, కూటమి నాయకులు బావన దుర్యోధన, లింగరాజు, సంతోష్ పండా, కర్రయ్య, చంద్రశేఖర్, డొంకూరు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పహారాలోనే..

● వెలవెలబోయిన వెంకన్న ఆలయ ప్రాంగణం

పలాస/రూరల్/కాశీబుగ్గ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భక్తుల రద్దీతో రెండు రోజుల కిందటి వరకూ కళకళలాడిన వేంకటేశ్వర స్వామి ఆలయం ఆదివారం పోలీసు పహారా నడుమ భక్తులు లేక వెలవెలబోతుంది. వేంకటేశ్వర స్వామి సహిత శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కనీసం కైంకర్యాలు చేసే పరిస్థితి కూడా లేకపోవడంతో ఆ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. శనివారం మధ్యాహ్నం కార్తీక ఏకాదశి సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తర్వాత పోలీసులు ఆ ప్రాంతంను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఘటనా జరిగిన తీరును తెలుసుకునేందుకు ప్రభుత్వం సిట్ బృందాన్ని ఏర్పాటు చేసింది. దీంతో వారి ఆదేశాల మేరకు ఆలయం మొత్తం పోలీసులు స్వాధీనం చేసుకోగా ఘటన జరిగిన ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. పరామర్శించడానికి వచ్చిన నేతలను స్వయంగా తీసుకెళ్లి వెంటనే పంపిస్తుండడం అక్కడున్న దృశ్యాలు భక్తులను కలచివేసింది. శ్రీనివాసనగర్ రోడ్డులో ఉన్న ఈ ఆలయంలోని స్వామివారి దర్శనానికి ప్రతీ సోమ, శనివారాల్లో వేలాది మంది భక్తులు వస్తుంటారు. దీనికి తోడు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తిరుపతి వెళ్లలేని భక్తులు స్థానికంగా ఉండే వెంకటేశ్వర స్వామి మందిరాన్ని చిన్న తిరుపతిగా భావించి స్వామివారిని కొలుచుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం ఏకాదశి కావడంతో దాదాపు 25వేలకు పైగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగినట్టు ప్రాథమికంగా తెలుస్తుంది. సంప్రోక్షలు చేపట్టిన తర్వాత వేదపండితులు, ఆగమశాస్త్ర నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు నిర్వాహకులకు సూచినలు చేసిన తర్వాత యథావిధిగా ఆలయాన్ని తెరిపించనున్నట్టు దేవదాయశాఖ మంత్రి ప్రకటించారు. దీంతో కొంత మంది ఆలయాన్ని మూసివేస్తారంటూ చేస్తున్న ప్రచారానికి మంత్రి ప్రకటనతో తెరపడింది.



నిర్మానుష్యంగా ఉన్న ఆలయ పరిసరాలు



ఆలయ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు

తిరుపతి వెళ్లలేకే..

నందిగాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శన భాగ్యం లేకే.. చిన్నతిరుపతి అన్న ప్రచారంతో వెళ్లి సోదరిని పోగొట్టుకున్నాం.. గ్రామస్థులతో కలిసి శనివారం స్వామివాని దర్శించుకుని బయటకు వస్తున్న సమయంలో ఘోరం జరిగిపోయిందని మృతురాలు చిన్ని యశోదమ్మ సమీప బంధువు కొర్రాయి సీలమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. తొక్కిసలాట సమయంలో యశోదమ్మ కింద పడిపోయి మృత్యువాతపడగా తాను పక్కకు ఒరిగిపోయి స్వల్పగాయాలతో బయటపడ్డానని తెలిపారు. తనతో పాటు ముగడ పార్వతి, కోనారి నరసమ్మ, సనపల డిల్లమ్మ, లండ కాకమ్మ, అనసూయమ్మ తదితరులం తొక్కిసలాటలో గాయాలతో బట్టామన్నారు. ఇదిలా ఉండగా యశోదమ్మ దహన సంస్కారాలు నిమిత్తం ప్రభుత్వం అందించిన రూ.10వేలును సర్పంచ్ సబ్బి జానకిరాం, వీఆర్వో మట్ట మురళీరావు చిన్ని రమణమ్మకు అందించారు.



మాట్లాడుతున్న సీలమ్మ, రమణమ్మ

ఆ చిరునవ్వులు మరిలేవు



తొక్కిసలాటకు ముందు క్యూలో చిరునవ్వులు చిందిస్తున్న నిఖిల్

పలాస/ రూరల్/ కాశీబుగ్గ, నవంబరు2(ఆంధ్రజ్యోతి): క్యూలైన్‌లో ఉండి ఫొటోలు తీస్తూ, నవ్వుతూ తోటి భక్తులను సందడి చేసిన చిన్నారి.. ఐదు నిమిషాల వ్యవధిలోనే విగత జీవిగా మారడం అక్కడివారిని కలచివేసింది. సోంపేట మండలం బెంకిలి గ్రామానికి చెందిన లొట్ల నిఖిల్(13) ఉదంతం. భక్తుల తొక్కిసలాటలో ఎనిమిది మంది మహిళలతో పాటు నిఖిల్ కూడా మృతి చెందాడు. క్యూలో అందరికీ ఉల్లాసపరుస్తూ అల్లరి చేశాడు. చిన్నతనం నుంచే నిఖిల్‌కి భక్తిభావం ఎక్కువ కావడంతో స్వామి దర్శనాలకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. అనుకోని ఘటన జరగడంతో ఆ కుటుంబంలో విషాదం నింపింది. నిఖిల్ చిరునవ్వులు ఇక ఉండవనే ఆవేదన, బాధ వారి కుటుంబంలో వ్యక్తమవుతోంది.

స్వామి చెంతనే..



అమ్ముడమ్మ(ఫైల్)

పలాస/రూరల్/కాశీబుగ్గ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డొక్కరి అమ్ముడమ్మ అంటే సూదికొండ కాలనీలో వెంకన్న భక్తురాలిగా సుపరిచితురాలు తన భర్త రాజారావుకు తిరుపతి వెంకన్న స్వామి దర్శనం చేయించాలని తరచూ కోరుతుండేది. సమయం లేక రేపు మాపు అంటూ రాజారావు చెప్పుకొస్తుండేవాడు. ఈ సమయంలో కార్తీకమాసం రావడంతో కనీసం చిన్నతిరుపతిగా పేరొందిన స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికై తీసుకెళ్లాలని కోరడంతో తాను రాను, ఒక్కదానివే వెళ్లమని చెప్పాడు. దీంతో గ్రామస్థులతో కలిసి స్వామివారి దర్శనానికి వెళ్లి తొక్కిసలాటలో చిక్కుకుపోయి మృత్యువాతపడింది. ఏ స్వామి కోసమైతే తహతహలాడిందో.. ఆ స్వామి చెంతనే అమ్ముడమ్మ మృత్యువాతపడడం సూదికొండలో విషాదఛాయలు అలముకున్నాయి.

అసత్య ప్రచారాలు మానుకోవాలి: ఎమ్మెల్యే మామిడి

పాతపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఘటనపై వైసీపీ నాయకుల అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఘటనపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ ఆలయం ప్రైవేటు వ్యక్తుల నిర్వాహణలో ఉందని ముందు గుర్తించుకోవాలన్నారు. ఏకాదశి వంటి పర్వదినాల్లో నిర్వాహకులు ప్రభుత్వానికి సమాచారమివ్వకపోడమే వల్లే ఈ ఘటనకు కారణమన్నారు. ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిందన్నారు. కాగా వైసీపీ నాయకులు ఈ ఘటనను రాజకీయ లాభంకోసం వాడుకొనే ప్రయత్నాలు చేస్తుండడం వారి దిగజారుడి తనానికి నిదర్శనమన్నారు. ప్రజల ప్రాణాలపై శవరాజకీయాలు చేయడం వైసీపీ నేతలకు అలవాటేనని ఆరోపించారు.

ఆలయాల భద్రతకు పటిష్ఠ చర్యలు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

పలాస/రూరల్/కాశీబుగ్గ నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆలయాల భద్రతకు కూటమి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆదివారం ఎంపీ సీఎం రమేష్‌తో కలిసి ఘటన జరిగిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన దురదృష్టికరమన్నారు. మరోసారి ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్న ఆలయాలపై ప్రభుత్వం ఒక పాలసీని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ.. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన ఆవశ్యకతపై ప్రభుత్వం మంచి ఆలోచనతో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.రెండు లక్షల చొప్పున అందించినట్టు తెలిపారు. అనంతరం పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వెంకన్న చౌదిరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న బీజేపీ నేతలు మాధవ్, సీఎం రమేష్

కాంగ్రెస్ నేతల పరామర్శ



వైద్యులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పలాస/రూరల్/కాశీబుగ్గ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తొక్కిసలాటలో మృతి చెందిన బాధితులను, మృతుల కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ఆదివారం పరామర్శించారు. శ్రీనివాసనగర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని తొలుత పరిశీలించి ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. భార్యను కోల్పోయిన డొక్కరి రాజారావును ఓదార్చారు. పార్టీ నాయకులు పేరాడ పరమేశ్వరరావు, డాక్టర్ రామ్మోహనరావు ఉన్నారు.

జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స

టెక్కలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పరిధిలో వెంకటేశ్వర ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో గయపడిన పలువురు ఆది వారం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామా నికి చెందిన నర్సిపురం అప్పారావు, లక్ష్మి చికిత్స పొందుతుండగా.. ఆది వారం టెక్కలి మండలం బూరగాం గ్రామానికి చెందిన నాగారపు రాజు చికిత్స కోసం చేరింది. గ్రామానికి చెందిన కొంతమందితో కలిసి స్వా మివారి దర్శనానికి వెళ్లగా తొక్కిసలాటలో కిందపడింది. ఈమె పైనుంచి పలువురు నడిచి వెళ్లడంతో అక్కడ నుంచి తేరుకొని ఇంటికి చేరుకుంది. ఇంటివద్ద వైద్యసేవలు పొందినా గాయాలు బాధపెట్టడంతో ఆదివారం చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి చేరుకుంది. ఈమెకు నడుంభాగం వాయడంతో పాటు కుడికాలు విరిగినట్టు తెలుస్తుంది. అలాగే నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామానికి చెందిన గొర్లె లక్ష్మణరావు జిల్లా కేంద్ర ఆసుపత్రికి చేరుకొని వైద్యపరీక్షలు నిర్వహించగా కుడికాలు పాదం వేలు చిట్లినట్టు వైద్యులు గుర్తించారు. ఈ మేరకు వైద్యసేవలు పొందుతున్నారు.



చికిత్స పొందుతున్న నాగారపు రాజు

● పలాస/ రూరల్/ కాశీబుగ్గ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన చికిత్స కోసం టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మందస మండలం సరియాపల్లికి చెందిన చెలియ కాంతమ్మకు రెండుకాళ్లు విరిగిపోవడంతో టెక్కలిలో శస్త్ర చికిత్స నిర్వహించేందుకు తరలించామని వైద్యుడు చిన్నం నాయుడు తెలిపారు. ఇదిలా ఉండగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించగా.. దీనిని ఆదివారం సాయంత్రం అందజేయనున్నారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

● నేడు రెండో కార్తీక సోమవారం

జలుమూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వరాలయంలో జరిగిన విషాద సంఘటనతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నెల 3న కార్తీక రెండవ సోమవారానికి ప్రముఖ శైవ క్షేత్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తుంది. ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో ఏడుకొండలు తెలిపారు. స్వామి దర్శనార్థం వచ్చే భక్తులు తోపులాటకు తావు లేకుండా పటిష్ఠమైన బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నలుగురు ఎస్‌ఐలతో పాటు 30 మంది పోలీసులు, మరో 20 మంది హోంగార్డులను నియమించినట్టు తెలిపారు.



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

● పాతపట్నం నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక నీలకంఠేశ్వరుని ఆలయానికి కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో పటిష్ఠమైన ఏర్పాట్లు చేశారు. స్థానిక మహేంద్రతనయ నదిలో స్నానాదలకు వెళ్లే భక్తుల రక్షణ కోసం బారీ కేడ్లు ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ కె.మధుసూదనరావు, తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, పంచాయతీశాఖ ఈవో వాన రామచంద్రరావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు. కాగా ద్వాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం స్వామివారి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కాగా కనీసం షామియానాలు కూడా లేకపోవడంపై భక్తులు ఇబ్బందిపడ్డారు.



పాతపట్నం: మహేంద్రతనయ నదిలో ఏర్పాటుచేసిన బారికేడ్లు

బాధితులను పరామర్శించిన వైసీపీ నేతలు



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

పలాస/ రూరల్/ కాశీబుగ్గ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర ఆలయలో జరిగిన తొక్కిసలాట ఘటనపై వైసీపీ నాయకులు ఆదివారం మధ్యాహ్నం పలాస సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. కూటమి నేతలు పరిపాలనలోకి వచ్చిన తరువాత 16 నెలల్లో ఇటువంటి ఘటన జరగడం మూడోసారి అన్నారు. తిరుపతి, సింహాచలం, కాశీబుగ్గలో తొక్కిసలాట జరిగాయని, దేనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టకపోవడంపై తప్పు పట్టారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, కె.కన్నబాబు, ధర్మాన కృష్ణదాస్, కొర్ల భారతి, పేరాడ తిలక్, పిరియ విజయ ఉన్నారు. ఆలయ భద్రత విషయంలో చంద్రబాబు సర్కార్ పూర్తిగా విఫలమైందని వైసీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆరోపించారు. ఆదివారం కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన ఆలయాన్ని ఆ పార్టీ నేతలతో పరిశీలించారు. ● శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగానే కాశీబుగ్గ ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని, 15 మంది గాయపడ్డారని ఎమ్మెల్సీ, వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులను పరామర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, విజయనగరం జడ్పీ చైర్మన్ చిన్నశ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదం పంపిణీ కౌంటర్ ఏర్పాటు

పాతపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక నీలమణిదుర్గ ఆలయంలో ఉచితప్రసాదం పంపిణీ కౌంటర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ అక్కంధ్ర సన్యాసి నాయుడు ఆదివారం ప్రారంభించారు. భక్తులకు మెరుగైనసేవలు అందించే దిశలో భాగంగా ఈకౌంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆలయకమిటీ సభ్యులు గురండి గోపాలరావు దాసరి రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వారి ఆశయాలను కొనసాగించాలి

పలాస రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో బొడ్డు అప్పారావు, బచ్చల సూర్యనారాయణ నిరంతరం తపించేవారని, వారి ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం అందరి పై ఉందని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిర ఆవరణలో ఆదివారం ఇటీవల మృతి చెందిన బొడ్డు అప్పారావు, బచ్చల సూర్యనారాయణలకు సంతాపం తెలుపుతూ మాట్లాడారు. ఉద్దాన ప్రాంతంలో యువజన సంఘ అభివృద్ధికి, పాఠశాల, ఇతర మౌలిక అంశాల అభివృద్ధిలో వీరు క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమానికి గిరిజన హక్కుల సాధన సంఘం రాష్ట్ర కన్వీనర్ విప్లవకుమార్ అధ్యక్షత వహించగా, వామపక్ష, యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కోటబొమ్మాళి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7 నుంచి 9వతేదీ వరకు కర్నూలులో జరగబోయే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కోటబొమ్మాళి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పి.గీతిక, జే.చంద్రలేఖ, జె.కవిత, ఎన్.గీతిక, సుస్మిత, డి.మహేష్ ఎంపికయ్యారని, వీరు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని ఎంఈవో డబ్బీరు గోవిందరావు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన సబ్ జూనియర్ (అండర్-16) కబడ్డీ సెలక్షన్స్‌లో వీరు ఎంపికైనట్టు తెలిపారు.

మండలస్థాయి గణిత పోటీలు

నరసన్నపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బోర్డుఉన్నతపాఠశాల ఆవరణలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో 8వతరగతి 9,10 తరగతి ఉపాధ్యాయులకు ప్రతిభా పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో మండలంలో 185 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచే విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వహకుల తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం

(ఐదో పేజీ తరువాయి)

మల్లా శ్రీనివాసరావు, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, మండల లచ్చయ్య, నవీన్ పాల్గొన్నారు.

● అలాగే కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు పలాస, టెక్కలి, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాల్లో పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టెక్కలి మండలం పిట్టలసరియా, రామేశ్వరం గ్రామాల్లో చిన్నమ్మి, విజయ కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. వజ్రపుకొత్తూరు మండలం దుక్కవాని పేట మురిపింటి నీలమ్మ కుటుంబానికి రూ.15లక్షల చెక్కును అందజేశారు. నందిగాం మండలం శివరాంపురంలో చిన్ని యశోదమ్మ కుటుంబ సభ్యులకు చెక్కును పంపిణీ చేశారు. పలాసలో డొక్కరి అమ్ముడమ్మ భర్త రాజారావుకు రూ.15లక్షలు అందజేశారు.

● సోంపేట మండలం బెంకిలి గ్రామానికి చెందిన లొట్ల నిఖిల్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.15 లక్షలు, కలెక్టర్ ప్రకటించిన రూ.లక్ష మొత్తంగా చెక్కును ఎమ్మెల్యే బెందాళం అశోక్ అందజేశారు.

క్షతగాత్రులకు రూ.3లక్షలు చొప్పున..

రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రభుత్వం తరఫున రూ.3 లక్షలు చొప్పున పరిహారం అందజేశారు. మందస మండలం బెల్లుపటియాకు చెందిన దువ్వు కుమారి, నందిగాం మండలం రౌతుపురానికి చెందిన బడే కళావతికి చెక్కులను పంపిణీ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, తహసీల్దార్ ఎం.గణపతి, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

టెక్కలి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యువత వ్యవసాలను దూరంగా ఉండాలని టెక్కలి చెందిన ఆధ్యాత్మిక వేత్త చంద్రశేఖర్ పట్నాయిక్ అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని సవరకిల్లి,సన్యాసీ నీలాపురం,ధమర గ్రామాల్లో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ అనే అంశంపై ఆయన మాట్లాడారు.యువత మారక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.మంచి అలవాట్లు పెంపొందించుకొని జీవతంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు లూకపాల్, డి.వాసుబాబు,కె.గొల్ల తదితరులు పాల్గొన్నారు.